11. మనిషి - మరో శిఖరం

కార్డు, కలం తీసుకొన్నాను మామయ్యకు ఉత్తరం రాయాలని. కానీ కలం సాగడం లేదు. ఏమని రాయాలి? ఎలా రాయాలి?

మామయ్యకు తీరని అన్యాయం జరిగిన మాట నిజమే.

ఆ దెబ్బనుండి మామయ్య యిప్పుడప్పుడే కోలుకోలేడన్నది నిజమే.

కానీ ఉపశమనంగా నాలుగు మాటలతో ఉత్తరం రాస్తే చాలు, తన కష్టంలో మరొకరుకూడా పాలుపంచుకో యత్నిస్తున్నారనే ఊహ మనిషికి మానసికంగా కొంత బలాన్ని చేకూరుస్తుంది, కాదనను, కానీ ..

ఏం రాయాలి?

ఇంతకు ముందెన్నడూ యిలా రాసిన పాపాన పోలేదు, రాయవల సిన అవసరం లేకపోయింధి. కానీ ఈనాడు రాసితీరాలి.

మామయ్య నాకు కేవలం మామయ్యే కాదు, నాన్న పోయినా నన్ను పెంచిన మా తండ్రి—ఈ నాడు తన ప్రాణప్రదమైన అత్తయ్యను కోల్పోయాడు శాశ్వతంగా!

అసలే గుండె జబ్బు మనిషి. ఈ అఘాతం నుండి ఎలా తట్టుకు ఒడ్డుకు చేరతాడో తెలియదు, అలాటి మామయ్యకు ఈ సమయంలో ఏమని ఉత్తరం రాయాలి? ఎలా రాయాలి?

మామయ్యా నీ కన్యాయం జరిగింది. అని రాయనా?

నిన్ను దేవుడు మోసం చేశాడు, అని రాయాలా? అత్తయ్య నిన్ను అన్యాయం చేసింధి, అని రాయాలా?

ఇద్దరు ఆడపిల్లల గతి ఏమయిపోతుంది? ఏమిటిలా జరిగింది?
ఏమీ పాలుపోవడం లేదు.

పోనీ.... ఒక్కసారి వెళ్లివస్తే....

నిజమే ఒక్కసారి వెళ్ళివస్తే మంచిది. వ్యక్తిగతంగా పరామర్శించడంలోనే మనిషి ఎక్కువగా ఎదటివారి కష్టంలో పాలు పంచుకోగలుగుతాడు.

మరునాడే బయలుదేరాను. నాలుగు వందలమైళ్ల ప్రయాణం ఎలా జరిగిపోయిందో నాకే తెలియక, తరువాత రోజుకు సామర్లకోటకు చేరుకున్నాను.

ఇంటికి వచ్చాను భయపడుతూ .. ఎలాటి దృశ్యాన్ని, ఎలాటి పరిస్థితిని, ఎంతటి భయంకర వాతావరణాన్ని ఎదుర్కోవలసి వస్తుందో ననుకుంటూ.

ఇంట్లో చావు తరువాత నిశ్శబ్దం తాండవిస్తూంది. ఆ నిశ్శబ్దంలో ఉన్న విచారం, గాంభీర్యం భయం కలగజేస్తున్నాయి. ఆ భయాన్ని అనుభవించ వలసి రావణ్ణం నిజంగా దురదృష్టం.

ఒక్క మనిషి లేకపోయే సరికి ఆ లంకంత యిల్లూ జీవం కోల్పోయింది. బావురుమంటూ మనుషులతోబాటు, మనసులతోబాటుగా ఆ ఇల్లూ ఏడుస్తూంది. నిజమేమరి, ఈనాటి అనుబంధమా అది? మనుష లెవరూ లేని యిల్లు. నన్ను చూసి దిగాలుగా నిలబడి పోయింది.

ఆ నిశ్శబ్దానికి బిక్క చచ్చిపోతూ మెల్లిగా అడుగులలో అడుగు లేస్తూ లోనికి వెళ్ళాను. ఏ గదిలోనూ ఎవరూ ఉన్నట్లు లేదు. వంట యింట్లోంచి ఏదో చప్పుడు వినిపిస్తూంది. మెల్లిగా అటు వెళ్లాను.
కుంపటిమీద ఏదో గిన్నె ఉంది. కుంపటి విసురుతూంది ఇందిర.

అడుగు చప్పుడు విని తల ఎత్తి చూసింది.

"బావా !" తుఫానులాగ ఒక్కసారి నన్ను చేరి బావురుమంది. 'బావా !' ఏదో చెప్పబోయి వెక్కిళ్లతో చెప్పలేక పోయింది.

"ఊరుకో ఇందూ .. ఊరుకో.... ఏడవకు మరి...."

ఇంతకన్న ఏమనాలి ?

శోకం అంతా ఒకచోటనే పోగుపెట్టినట్లున్న ఇందిరను చూస్తుంటే ఆ శోకంలో పాలు పంచుకోవాలనేదే నా తాపత్రయం.

కానీ ఎంతయినా ఇందిరకు అమ్మ.

అమ్మ జీవితంలో ఎవరూ కోల్పోకూడని దేవత.

అలాటి దేవతని కోల్పోయింది ఇందిర.

ఈ ఆపత్సమయంలో ఇందిర నా నుంచి తోటి మనిషిగా సానుభూతి కోరుకుంటూంది. ఎంతో చెప్పాలని వుంది. ఏమీ చెప్పలేని స్థితి.

స్వర పేటికకు దుఃఖం అడ్డు పడింది.

పలకబోయిన నాలుగు పదాలకు ఆత్మీయత అడ్డు వస్తూంది.

ఇందిర ఎంత బేలగా మారి శోకంతో నిండిపోతే ఇందిర చెల్లెలు వసంత సంగతి ఎవరు చెప్పగలరు ?

అది యింకా చిన్నపిల్ల, ఇందిరకన్న దాదాపు ఎనిమిదేళ్లు చిన్న. అమ్మ ఒడిని వదలి ఉండలేని వయస్సు దానిది. యింత చిన్న వయసులోనే అది ఆ అదృష్టాన్ని పూర్తిగా కోల్పోయింది.

అయినా వసంత ఏది?

ఇందిర వెక్కి-వెక్కి ఏడుస్తూంది భుజం మీద పడి. ఈ సమయంలో అసలు ఆలోచన కూడదు, అనునయం తప్ప.

"లే . ఊరుకో ఇందూ, నా మాట వినవూ... "

ఎలా వినగలదు నా మాట ?

ఎంతటి దుఃఖం యిది ?

ఎంతటి బాధ యిది! ఎలా వినగలదు నా మాట!

"ప్లీజ్.... వినాల మరి...."

"బావా!" ఏదో చెప్పబోయి ఎక్కిళ్లవల్ల ఆగిపోయింది.

"తరువాత చెబుదువుగానిలే.... ఊరుకో మరి...."

ఇందిర ఎక్కిళ్ళను ఉన్నట్లుండి ఆపేసింది. ఒక్కసారి తల ఎత్తి నాకేసి చూసింది.

"ఎవరో వస్తున్నారు గదా?"

ఆశ్చర్యపోయాను ఈ హఠాత్పరిణామానికి.

నేనిది ఊహించలేదు.

జాగ్రత్తగా ఆలకించాను, అడుగుల చడి వినవస్తున్న మాట నిజమే.

"ఆ—"

అంతే, ఇందిర పరుగున వెళ్లి కుంపటి ముందు వాలిపోయింది. పైట చెంగుతో కన్నీటిని తుడుచుకుంది ఆత్రతతో. వెక్కిళ్లను ఆపుకో ప్రయత్నిస్తూంది, శతవిధాలా. అయినా అవన్నీ వ్యర్థ యత్నాలే అవుతున్నాయి.

వచ్చింది మామయ్య, వసంత ప్రభృతులు. మిగతావాళ్ళు నాకు తెలీదు. వారి రాక ఏదో సానుభూతి వాక్యాలు అందించటానికి కాబోలు.

ఇందిరకేసి చూశాను, సీరియస్‌గా పనిలో నిమగ్న మయింది.

అశ్చర్య పోవటం మినహా యింకేమీ చేయలేక పోయాను.

అయినా ఏమిటిది?

కన్నతల్లి చనిపోయింది, అయినవారితో కష్టాన్ని చెప్పుకొని, వారినుండి ఆత్మీయత నిండిన రెండు వాక్యాలు కోరుకోవటంలో తప్పే ముంది?

పైగా ఇందిర చూపులో భయం !

ఎందుకో ?

"బావా ! ఎప్పుడు వచ్చావురా ?" వసంత పలకరింపుతో ఆలోచనలు ఆగిపోయాయి.

నవ్వాలనే యత్నం నాలోనే అణగారిపోయింది.

మామయ్యను చూశాను, పలకరించాలనే యత్న చేయబోయాను. అదీ విఫలమయి పోయింది.

"ఏరా ! కులాసాగా వున్నావా ?"

మామయ్య నుండి నేనాశించింది యిదికాదు. ఇంత మామూలుగా ఎలా ప్రశ్నించ గలుగుతున్నాడు ?

ఛ, ఏదో అపస్వరం. ఎందుకో తెలియదు, ఎక్కడినుండో విని పిస్తూనే వుంది.

చావు నిజంగా యింత భయంకరమా ?

మామయ్య యిదే ప్రశ్న యింకో సందర్భంలో వేసివుంటే నాకీ అనుమానమే వచ్చేదిగాదు. ఏదో విధంగా ఈ ప్రశ్న జవాబును పొంద గలిగేది.

అయినా మామయ్య యింత మామూలుగా ఎలా అడగ గలిగాడు ?

ఏదో అపశ్రుతి భయంకరంగా వినిపిస్తూంది.

అత్తయ్య అకాల మరణం'

ఇందిర అకారణ భయం !

మామయ్య అకాలపు కుశల ప్రశ్న ! ఏదో విషవలయం ఉందని పిస్తూంది.

'ఛ' ఉండి వుండదు.

ఇది కేవలం మృత్యువు చేసిన వికటాట్టహాసపు ప్రతిధ్వనే తప్ప మరేదీ కాదు,

'ఇది నిశ్చయంగా చావు కలిగించే భయమే తప్ప యింకేమీ కాదు.- అని అనుకోవాలనుకున్నా, ఆత్మవంచనకు నా మనస్సు సిద్ధంగా లేదనే సంగతి నే నెరిగిన సంగతే!

ఇందిర అందిచ్చిన కాఫీ తీసుకున్నాను. వేడి కాఫీ గొంతులో పోసుకునే సరికి మరో వేయి ప్రశ్నలు మస్తిష్కంలో తల ఎత్తాయి.

అన్ని ప్రశ్నలకు సమాధానం యిప్పుడే దొరకదు.

వేచిచూస్తే క్షణంగడిస్తే, ఈ ముడికట్టును కాలమే విప్పుతుంది.

కాఫీతాగి, యిందిర నాకోసం వేసిన మంచంమీద నడుంవాల్చాను. నాకు తెలుసు, యిదేం బాగాలేదు. బద్ధకం తీర్చుకోడానికి యిది సమయం కానేకాదు.

కానీ అలా జరుగుతోంది!

ఇదంతా ఎలా అర్థం చేసుకోవడమే?

విధి అని సరిపెట్టుకోవడం-?

అంతకన్న ఈ క్షణంలో ఇంకోటి తోచడం లేదు మరి.

ఆ రోజు గడిచింది ఎలాగో.

మరునాడు ఉదయమే మామయ్య ఆఫీసుకు తయారయ్యాడు.

నేను ఆశ్చర్యపోయాను, చావును ఇంత నిర్లక్ష్యంగా చూడగలిగిన వ్యక్తి నా కింతవరకూ ఒక్క మామయ్యే కనిపించాడు.

ఇది నిర్లక్ష్యమే అనాలా?

లేకపోతే వైరాగ్యమే అనాలా?

ఏమో ఏదైనాగానీ ఇది ఆశించదగ్గ మార్పు మాత్రం కాదు.

అందుకే అడిగాను మామయ్యను పోనీ సెలవైనా పెట్టకూడదాఅని.

"ఎంతకాలం సెలవు తీసుకోనురా ?

—పోనీ సెలవు తీసుకొన్నా లోటు తగ్గిపోతుందా ? ఇంటివద్దనే ఉంటే యింకొంచెం బాధ...."

నిజమే !

ఇంట్లో అణువణువూ అత్తయ్యను జ్ఞాపకం చేస్తూంది. ఈ జ్ఞాపకాల నుండి తప్పించుకోవాలంటే యిదే మార్గమేమో !

మామయ్య ఆఫీసుకు వెళ్ళిపోయాడు. మామయ్య మెట్లుదిగగానే తలుపు వేసేసింది యిందిర.

"బావా ! నాకు భయంగా ఉంది బావా'" రాబోయే ఎక్కిళ్ళను ఆపు కొంటూ అంది.

ఇందిర మాటలేవీ నా కర్థం కాలేదు.

"భయమా ? ఎందుకే అర్థం లేకుండా ?"

అటూ యిటూ చూసిందొక సారి ఇందిర.

ఆ చూపులో భయం.

ఆ చూపులో ఆందోళన.

ఒకసారి ఇందిరకేసి చూశాను. కను కొలకులలో నిండిన నీరు తళుక్కున మెరిసింది. ఆ మెరుపులో ఆ కన్నీటి వెనక దాగిన భయం ఆందోళన, బాధ అన్నీ ఒక్కసారి ఓ వెలుగు వెలిగాయి.

"ఎలా చెప్పను బావా నీకు ? నా బాధ చెప్పుకునేది గాదు... "

ఏమిటి ఇందిర అనేది ?

ఇందిర బాధ చెప్పుకునేది గాదా ? అత్తయ్య చావుకు ఇందిరే కారణమా ?

ఇందిర యౌవనంలో ఉంది – కాలు జారితే ...

ఛ, ఎంత అసహ్యంగా ఉన్నాయి నా ఆలోచనలు !

"చెప్పు యిందిరా చెపితే సగం బాధ తీరిపోతుంది."

బహు పేలవంగా నవ్వింది ఇందిర — "చెబితే తీరేబాధ గాదు బావా యిది! నిజం చెప్పాలంటే చెప్పుకుంటేనే అధికమవుతుంది."

"ఏమిటో యిందిరా అంతా అయోమయంగా ఉంది."

"నిజం బావా! అంతా అయోమయంగానే ఉంది. ఏదీ ఎందుకు జరుగుతుందో ఏమీ తెలియడం లేదు."

ఇందిరను ఆపుతూ అన్నాను—

"చూడు ఇందూ. సరిగా చెపితే చెప్పు లేకపోతే లేదు – గానీ ఉపోద్ఘాతం యింక మానేసెయ్"

ఇందిర నాకేసి చూసింది. "యింతవరకు ఎవరితోను చెప్పుకోలేదు బావా, అసలిది ఒకరితో చెప్పేదిగాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే బావా, అమ్మచావు సాధారణంగా జరిగింది గాదు, అమ్మను చంపేశారు...." వెక్కివెక్కి ఏడ్వసాగింది యిందిర.

అదిరి పడ్డాను నేను.

నేను నిజమే వింటున్నానా?

అత్తయ్యను చంపేశారా?

ఎవరు? ఎందుకు? ఎలా?

అసలు అత్తయ్యకు ఎవరు ద్రోహం తలపెట్టగలరు?

అత్తయ్యతో పరిచయమున్న ప్రతివారు అత్తయ్యతో ఉన్న మాతృత్వ మమతల మాధుర్యాన్ని చవిచూడ గలరే తప్ప..

అత్తయ్యకు కూడా శత్రువు లుంటారనేది నేను నమ్మలేను.

"ఇందిరా, నమ్మమంటావా?"

"నమ్మలేవు బావా... అసలు నేనే నమ్మలేదు .... కాని ఇది నిజం అమ్మ చావు నాన్న చేతిలోనే..." ఏక్కిళ్లతో మాట పూర్తిచేయలేక పోయింది యిందిర.

ఇందిర మాట పూర్తి చేయలేదు గానీ అర్థం అయిపోయింది నాకు.

కాని యిది అసంభవం, హాస్యాస్పదం కూడాను.

అత్తయ్యను మామయ్య చంపడం.... ఛ!

"ఇందిరా, నువ్వు చూశావా?" చూసి వుండదనే ధీమాతో అడిగాను.

"ఆ, పాలు తీసుకువెళ్ళటం నాకు బాగా తెలుసు...."

వసంత రావటంతో టక్కున ఆపేసింది ఏదో చెప్పబోయిందల్లా.

"అక్కా, అన్నం పెట్టవే"

"వస్తా బావా, దీనికి అన్నంపెట్టి"

వెడుతూ వెడుతూ ఆగిపోయి అంది ఇందిర — "బావా ఎక్కడా నోరు జారకు, ప్లీజ్...."

తల ఊపాను సరేనన్నట్లు.

ఏమిటి ఈ యిందిర కథనం?

ఇలా జరుగుతుందా ఎక్కడైనా?

నమ్మశక్యం కాకుండా ఉంది — మామయ్యా అత్తయ్యా కలిసి సుమారు ఇరవై సంవత్సరాలనుంచీ కాపురం చేస్తున్నారు. మామయ్య అత్తయ్యను పల్లెత్తుమాట అనగా నే నెప్పుడూ వినలేదు. అత్తయ్యఅంటే మామయ్యకున్న ఆ ప్రేమ, ఆ ఆదరణ, ఆ అనురాగం ఎక్కడో కానీ లోకంలో చూడము!

కానీ ఈ యిందిర ఏం చెబుతోంది?

వెలుగు వెనుకనే నీడ, ప్రేమచాటునే ద్వేషమా ?

ద్వేషం ఉన్నా కానీ యింత అధికంగానా ?

హత్య చేయవలసినంత అవసరం కలిగిందా ?

ఏమో,

మళ్లీ వెళ్ళి యిందిరను చేరాను. నన్ను చూడగనే పీట వేసింది యిందిర. గారాబు చేస్తున్న వసంతకు ఏవేవో కబుర్లు చెబుతూ అన్నం పెడుతూంది.

"చెప్పు !" అన్నాను నేను.

"ఏం చెప్పను ? వసంత ఉంది. అది వెళ్లాక చెబుతాను" అంది ఇంగ్లీషులో ఇందిర.

"ఫర్వాలేదు, ఇంగ్లీషులోనే చెప్పు" అన్నాను.

ఇందిర నాకేసి చూసి అంది—

నేను అపుడే వైదేహి ఇంటినుంచి వచ్చాను. వైదేహి అంటే ఎవరో నీకు తెలుసుగా ?

"ఆ రిటైర్డ్ జడ్జీ గారమ్మాయేనా ?"

"అవును. వైదేహీ, వాళ్ల అన్న కూతురి పుట్టిన రోజని పేరంటానికి రమ్మంది! వెళ్లకపోతే బాగుండదని అమ్మ మరీ మరీ అంటే, వెళ్లాలని లేకపోయినా వెళ్లాను. నాన్నకూడా వెళ్లమనే అన్నాడు-అన్నట్లు బావా, ఆ రోజు నాన్నకు సెలవు ! వైదేహి యింటినుంచి తిరిగివచ్చే సరికి....'

"అంతా అయిపోయిందా ?"

లేదన్నట్లు తల ఊపింది ఇందిర– "ఇంటికి రాగానే నాన్న రెండు సినిమా టిక్కెట్లు యిస్తూ అన్నారు, నువ్వూ వసంతా సినిమాకు వెళ్లం డంటూ ! అదీ బలవంతంగానే వెళ్లాము. ఇలా జరుగుతుందని ఏ మాత్రం తెలిసి ఉన్నా వెళ్లేదాన్ని కానేమో !"

వసంత భోజనం పూర్తయింది. లేచి బయటకు వెళ్లి పోయింది.

"....రాత్రి మేం తిరిగి వచ్చేసరికి నాన్న నన్ను భోజనం పెట్ట మన్నాడు, ఇంకా తినలేదా నాన్నా ?' అనడిగాను నేను, 'లేదు' అన్నారు. ఎప్పుడైనా మేం సినిమాకు వెడితే, తిరిగి వచ్చేసరికి వాళ్లు భోజనం చేసి ఉండేవారు. కానీ ఆ రోజు వాళ్లు అలానే ఉండిపోయారు. అమ్మనడిగితే తను తిననంది–భోజనం చేశాక నాన్న పాలుకాచి గ్లాసులో యిమ్మన్నారు. ఇచ్చాను. గ్లాసులో పాలు తీసుకొని గదిలోకి వెళ్లాడు నాన్న ! ఇదీ జరిగిన సంగతి !" ఆగింది ఇందిర.

నిజం చెప్పాలంటే ఇందిర పరిస్థితి చూస్తే జాలేసింది.

—భార్యాభర్తల మధ్య గొడవ జరగకూడదని ఎక్కడా లేదు. జరగకపోవడం ఒక్కోసారి అసహజం కూడాను ! ! ఇద్దరిలో ఏ ఒక్కరి కైనా సహనం, సర్దుకుపోయే శక్తీ ఉండాలి. అలా అయితేనే, ఆ పవిత్ర బంధానికి ఓ అర్థం అంటూ ఉంటుంది —— అత్తయ్యతో రాజీకోసం

మామయ్య పాలుతీసుకొని వెళ్లి ఉండొచ్చు—రాజీ కన్నా యింకేఉద్దేశం ఉంచి ఉంటుంది ?

—నాకు తోచింది యింతే! అదే అన్నాను. కానీ ఇందిరకు నేను అన్నదాంట్లో నమ్మకం కుదరలేదు. తల ఊపుతూ అంది:

"నేను నమ్మను బావా! ఆ తర్వాత ఏం జరిగిందో నీకు తెలీదు. తెలిస్తే యిలా అనే వాడివి కాదు.—నాన్న గదిలోకి వెళ్లాక, తలుపు వేసుకొని యిద్దరూ గొడవ పడ్డారు."

"గొడవ అంటే?"

"అంటే ఏం చెప్పనూ? నాన్న ఎంత బలవంతం చేసినా అమ్మ పాలు తాగననే అంది. మీరిలా అన్నాక పాలు మాత్రం ఎందుకు, నన్నిలా చావనివ్వండి, అంటూ అమ్మ ఏవేవో అంది. 'ఫర్వాలేదు, తాగు. పాలు తాగినా చస్తావులే! నీ నొసట అలాగే రాసిఉంటే అలాగే జరుగుతుంది, అంటూ నాన్న అమ్మను తిడుతూనే ఉన్నాడు. రాత్రి ఒంటిగంట వరకూ యిలా ఘర్షణ పడుతూ ఉన్నారు. అంత రాత్రయినా, అమ్మ మాత్రం, మీరిలా అన్నాక నాకు చావే గతి అంటూనే ఉంది. చెబుతున్న ఇందిర దీర్ఘంగా నిట్టూర్చింది.

—ఇంకా ఇందిర ఏమేమో అంటోంది. ఇందిర మాటలు నమ్మాలో లేదో నాకు తెలీలేదు. ఎలాగో అన్నాను— "ఇదంతా నీ ఊహేమో ఇందూ! నిజమని నమ్మబుద్ధి కావటం లేదు."

"లేదు బావా లేదు, నువ్వు నమ్మి తావు, నమ్మడానికి ఆస్కారం లేదనకు, చూపిస్తాను ఉండు." అంటూ లేచింది ఇందిర. నేనూ అనుసరించాను.

మామయ్య పెట్టె దగ్గరకు వెళ్ళి ఆగింది యిందిర. క్షణం ఆగి అంది—"సారీ బావా" అంటూనే మేకుతో తాళం తీసేసింది.

ఆశ్చర్య పోయాను, ఇందిర హస్తలాఘవానికి;

ఇందిరకు ఇన్ని విద్యలు ఎలా తెలిసాయి?

భయం, అనుమానం, మనిషికి ఏన్నో పాఠాలు నేర్పుతాయన్న మాట;

కానీ ఈ భయం, ఈ అనుమానం మనిషికి పాఠాలయితే నేర్పుతాయిగానీ మనిషికి దీనివల్ల కోల్పోయే వస్తువు మాత్రం అమూల్యమయినది.

మానవత్వమే కోల్పోవలసి వస్తుంది ఈ భయంవల్ల.

మనిషిని నమ్మటంలో నీకు నమ్మకం లేకపోతే మనిషిగా మనుగడ సాగించగలిగే అర్హత ఉండదు నీకు. తోటి మనిషిని ప్రేమించటం చేతకాకపోతే కాకపోవచ్చు గానీ, అందుకని ద్వేషించడం మాత్రం కూడదనిపని.

క్షమార్హం కూడా కాదది.

"ఇది చూడు బావా! –" అంది ఇందిర మామయ్య డైరీని తీసి చూపిస్తూ.

చూశాను ఒకటే ఒక వాక్యం "అనుకున్నంతా అయిపోయింది."

ఇందిరకేసి చూశాను ఆ వాక్యానికి భాష్యం చెప్పమని.

నవ్వింది నా అమాయకత్వానికి — నీకే మాత్రం తెలియదా అన్నట్లు.

"అమ్మపోయిన తరువాత రోజున రాసింది యిది — అర్థమయిందా ?"

తల ఊపానుగానీ నిజానికి ఏమీ అర్థం కాలేదు.

అసలు ఇందిరకు ఈ అనుమానం ఎందుకొచ్చింది?

ఇందిర చూపే ఏ కారణం సరిఅయినదిగా అనిపించటం లేదు. అయినా ఇందిరచెప్పే విధానం, ఆ భయాందోళనలను చూస్తే ఏమిటో....

నా కింకా మనిషిలోని మానవత్వం మీద నమ్మకం సడలి పోలేదు. దానవత్వంమీద గురి ఏర్పడటం లేదు.

"బావా అన్నట్లు మర్చేపోయాను, భోజనం చేస్తావా ?"

"వెళ్లి వడ్డించు, నే వస్తాను...." ఇందిర వెళ్ళిపోయింది.

ఎందుకో మామయ్య పెట్టె అంతా చూడాలనిపించింది, మౌనంగా అన్నీతీసి చూడ నారంభించాను. ఏవేవో కాగితాలు అన్నీ చూశాను వివరంగా. అన్నిటికన్నా నన్నాకర్షించింది ఒక్కటే ఉత్తరం. చదివాను.

అదే కారణం, అంతే !

ఇందిర అన్నది అక్షరాల నిజం.

మామయ్య హత్యచేశాడు.

ఇక అనుమానం లేదు, అత్తయ్య చంపబడింది. కానీ ఇందిర ఈ ఉత్తరం సంగతి అసలు చెప్పదేం ? తెలీదా ?

"ఇందూ, మాట—"

పరుగున వచ్చింది ఇందిర — "అబ్బ హడలిపోయాను బావా ఏమిటోననుకొని, అయినా భయం...."

"ఇది చూడు — " అంటూ ఉత్తరం అందించాడు ఇందిరకు.

"ఏమిటిది?" అంటూనే ఉత్తరం తీసికొంది. "అమ్మకా?"

"ఔను—పైకి చదువు."

నాకేసి చూడకుండానే తల ఊపి పైకి చదవ నారంభించింది ఇందిర.

"డియర్ రాజూ,

దాదాపు ఇరవై ఏళ్ళ తరువాత ననుకుంటాను నీకీ ఉత్తరం రాస్తున్నాను. నీ అడ్రసు కోసం ఎంత పాటు పడ్డానో ఆ దేవుడికే తెలియాలి. మొన్న అనుకోకుండా నా చిన్ననాటి స్నేహితుడు రామమూర్తి కనిపించటంతో నీ గురించిన విశేషాలు అన్నీ తెలిశాయి. పెళ్ళయిందట గదూ ? కంగ్రాచ్యులేషన్స్. కానీ ఒకటే బాధ— నా ఇల్లాలు కావలసిన దానివి, ఇంకొకరి యిల్లాలైనావు.

ఈ నా డనిపిస్తుంది రాజూ నే నానాడు పారిపోవటం మంచిపనే చేసినట్లయింది. లేకపోతే అబ్బ! తలచుకోవాలంటే భయంగా ఉంది. పారిపోయి తిరిగి రావాలనే, తిరిగి వచ్చి నిన్ను నా దాన్నిగా చేసుకోవాలనే ఆకాంక్ష ఉండేది నాలో. కానీ.... కానీ... అయినా అన్నీ అనుకున్నట్లు జరగవు. ఎన్ని అనుకున్నాము మనము – జంటగా విడి విడిగా ఎన్ని కలలు కన్నాం! మన పాపను డాక్టరు చేయాలనీ, మరీ అందంగా ఉంటే యాక్టర్ చేయాలనీ .. ఇంకా ఎన్నో! అన్నట్లు పాపను రాజమండ్రి వెంకటేశ్వర్లు మాస్టరుగారి ఇంటివద్ద వదిలేశావని తెలిసింది, నిజమేనా ? మనం యిద్దరం వుండి కూడా ఎవరూ లేని అనాథగా మారిపోయింది పాప ! అదే బాధగా వుంది నాకు.

వచ్చేస్తాను రాజూ, నీ అడ్రస్సు తెలిసాక ఇక యిక్కడ ఉండటం నా వల్ల కాదు. పాపను కూడా ఎలాగో తెచ్చేసుకుందాం. రాజా రాణిల్లాగ కాలం గడుపుకోవచ్చు. వచ్చే ముందు నీకు మరో ఉత్తరం రాస్తాను.

ఉంటాను మరి –

ఎన్నాళ్ళకో మళ్ళీ నీ కౌగిలిలో కరిగిపోయే అవకాశం వచ్చింది. ఈ సారి నా దేవతను అంత మూర్ఖంగా వదులుకోను.

"కౌలాలంపూర్. నరసింహం"

దీర్ఘంగా నిట్టూర్చింది యిందిర.

"నిజమేనంటావా ?"

"ఇది చూడు" అంటూ డైరీని అందించాడు యిందిరకు.

అది చదివి యిందిర ఆశ్చర్యపోయింది, మామయ్య రాజమండ్రీ వెళ్ళటం, ఆ విషయం విచారించటం కూడా జరిగాయి.

"ఇక సందేహం లేదు బావా !"

ఇందిర ఆ మాట అంటుందని నాకు యింత క్రితమే తెలుసు. అందుకే నేను ఆశ్చర్యపోలేదు.

కానీ, నిశ్చయంగా యిదేమీ బాగాలేదు, యిందిరకు ఎందుకు వచ్చిందీ అనుమానం ? ఎన్ని మనస్పర్థలకు ఆలవాలం అయింది ఇది !

"బావా"

తల ఎత్తి చూశాను యిందిర కేసి. యిందిర కళ్ళల్లోంచి నీరు ధారగా కారుతూంది. ఇప్పుడు ఆ అనుమానం తనకు కలిగినందుకు పశ్చాత్తాపం పడుతూందేమో !

కానీ యిది సమయం కాదు, సమయం ఏనాడో మించి పోయింది. ఈనాడు ఆకులు పట్టుకుంటే లాభం లేదు.

"బావా బట్టలు వేసుకో...."

"ఎందుకు ?"

"పోలీసు స్టేషనుకు రావాలి నాతో"

ఆశ్చర్యపోయాను నేను. "ఇందిరా !"

"ఔను బావా ! తప్పుచేసిన వాడు శిక్ష ననుభవించాలి"

"కానీ, యిందూ, మీ నాన్న...."

"నాన్నే బావా కాదన్నానా ? అయినా తప్పు తప్పే మరి? ఆ తల్లి దండ్రులకు పుట్టినందుకు మాకూ శిక్ష కావాలి. అంతే!"

ఇందిర అంత నిక్కచ్చిగా మాట్లాడు తుంటే జవాబు చెప్పలేక పోయాను. మౌనంగా లేచి బట్టలు వేసుకున్నాను.

ఇందిర పెట్టెదగ్గిరే దిగాలుగా కూర్చుని ఉంది. నా పని పూర్తి కాగానే అన్నాను—లే, యిందూ లే!"

ఇందిరలో దుఃఖం కట్టలు తెంచు కొంది. వెక్కి వెక్కి ఏడక నారంభించింది.

"రాలేను బావా ! ఎలా రమ్మంటావు ? నా కంత ధైర్యం ఉందనే అనుకున్నావా ? అనుకుంటున్నావా ?"

ఏం చేయాలో తోచడం లేదు నాకు,

ఇందిరలో యింత బేలతనం....

క్షణం క్రితం యిందిరకు, ఈ క్షణం లోని యిందిరకు ఎంతతేడా !

మనిషి కూడా రంగులు మార్చగలడనేది నాకీ క్షణంలో తెలిసింది.

వీధి తలుపు తట్టిన చప్పుడయింది.

"మామయ్యేమో ?"

" ఆ అయి ఉండదు. ఈ సమయంలో ఎప్పుడూ రాడు." అంది యింధిర ఎక్కిళ్ళను ఆపుకుంటూ.

లేచి వెళ్ళి తలుపు తీశాను.

మామయ్య !

ఏమనాలో, ఏమనుకోవాలో తెలియలేదు.

ఏం జరుగుతుందో ననే భయం, ఆందోళన, ఉత్కంఠ.

అయినా సాధ్యమైనంత వరకూ నా ముఖంలో భావాలేమీ ప్రతి బింబించ కుండా ఉండేట్లు జాగ్రత్త పడ్డాను.

ముందు నడుస్తున్న మామయ్యకు వెనకగా నేను.

ఆ గది ముందుకు రాగానే ఆగిపోయాడు. మామయ్యను చూసి ఆశ్చర్య పోయింది ఇందిర.

నా గుండెల్లో గుండెలు లేవు.

తుఫానుకు ముందుగా వుండే ప్రశాంత పరిస్థితిలో ఉంది వాతావరణం.

మామయ్య కూడా బహుశా ఈ పరిస్థితిని ఊహించి వుండడు. తెరిచి వుంచిన పెట్టె. చిందరవందరగావున్న బట్టలు. ఆ వుత్తరం ఆ డైరీలు....

చాలు !

ఈ కథ చెప్పడానికి యింతకన్నా వేరేవీ అక్కర్లేదు.

"ఆ డైరీ యిలా అందుకో అమ్మా"

మౌనంగా అందించింది ఇందిర. డైరీని అందుకొన్న వెంటనే అన్నాడు మామయ్య క్షమాపణ చెప్పుకుంటున్నట్లుగ – డైరీ మరిచి పోయాను. అందుకే వచ్చాను"—

ప్రాన్పడి పోయాను.

ఈ దృశ్యాన్ని చూశాకకూడా మనసులో భావ సంచలనాన్ని పైకి రాకుండా ఎలా ఆపుకోగలిగాడు ?

వీళ్ళ మధ్య నేనెంతకాలం గడిపాను. నిజమే !

కానీ వీళ్ల నెవర్నీ అర్థం చేసుకోలేకపోయాను.

నిజానికి వాళ్లే నాకు అర్థం కాలేదు. నా ప్రయత్న లోపం లేదనిపిస్తూంది.

మనిషిని, ఆ మనిషిలోని భావాలు ఎదుటివాడు తప్పు లేకుండా ఏనాటికి అర్థం చేసుకోగలడు ?

....ఏమో, అయినా యిలాంటి విచిత్ర ప్రకృతి, మానసిక ప్రవృత్తులు ఉన్న మనుషుల మధ్య వుండటం అంత శ్రేయస్కరం కాదు.

వీళ్ళ సమస్యలను వీళ్ళకే వదిలివేస్తే. వీళ్ల యిష్టానుసారం వీళ్లే పరిష్కరించుకొంటారు.

అదే అన్నాను ఇందిరతో – పేలవంగా నవ్వింది ఇందిర.

“ అంతే బావా – ఈ లోకంలో ఎవరికి ఎవరూ ఏమీ కాదన్నది మరోసారి ఋజువు చేస్తున్నావు. పోనీలేగానీనాకోసాయం చేస్తావ్, ప్లీజ్?

“ ఏమిటి ?”

“ ఈ విషయం నాకు తెలియకుండా నువ్వెవ్వరికి చెప్పకూడదు, సరేనా ?”

“ సరే –”

“ముఖ్యంగా పోలీసులకు—”

“సరే అంటున్నానుగా—”

ఆ రోజు రాత్రే వెనుదిరిగి వచ్చేశాను, నేను.

వారం రోజులు కూడా సరిగా గడిచాయో లేదో అనుమానమే !

ఆ వేళ ....

ఎవరో తలుపు తడుతూంటే మెలకువ వచ్చింది.

బద్ధకంతో వెళ్లి తలుపు తీశాను.

తలుపు తీసేసరికి నిద్ర అంతా దూదిపింజలా ఎగిరిపోయింది.

ఇందిర, వసంత !

“నాన్నను పోలీసులు తీసుకువెళ్లి పోయారు బావా”

ఇందిరకేసి చూశాను నిజమా అన్నట్లు.

మౌనంగా పర్సులోంచి ఉత్తరం అందించింది. చదివాను.

“చి. ఇందిరకు,

ఆశీస్సులు. నీకు తెలిసిపోయింది నిజమేనమ్మా.

రాజును నేను చంపేశాను—

రాజు నన్ను మోసంచేసింది నిజం ఒప్పుకొనుంటే క్షమించ గలిగేవాడినేమో ! కానీ, అబద్ధమే చెప్పింది నాతో.

అది క్షమించలేకపోయాను.

నిజమేనమ్మా, తప్పుచేసిన మనిషిని క్షమించగలగటం ఎంత గొప్ప విషయం !

కానీ, క్షమించటంలోనే శిక్షించటం కూడా యిమిడి ఉందన్న సంగతి నాకు తెలియదు.

నువ్వు నాకు తెలియజేశావు. నేను చేసిన పని నీకు తెలుసు. అయినా దాన్ని క్షమించగలిగావు. కానీ నువ్వు క్షమించటం నా కిష్టం లేదు.

ఈ శిక్షను అనుభవిస్తున్నది మనస్సు. ఇక భరించలేను !

అందుకే నా అంతట నేను వెళ్లి పోలీసులకు లొంగిపోతున్నాను

నన్నొకసారి క్షమించావు. తద్వారా శిక్షించావు, మరొకసారి నన్ను క్షమించి, ఈ శిక్ష అనుభవించగలిగే ఆత్మ విశ్వాసం కలిగించు,

కృష్ణారావు.

ఉత్తరం చదివాను.

నిజమే, క్షమ కన్న వేరే శిక్ష ఏముంది గనక !

ఇందిర ముందుగా నిలబడి ఉంది.

నా కళ్ల ముందే మానవత్వపు మహోన్నత శిఖరాలను అధీష్టించ గలిగిన ఆ మనిషిని, అదే ఇందిరను — నా బాహువులలో యిముడ్చు కోవటానికి విఫలయత్నం చేశాను.

[ఆంధ్రప్రభ 4-3-70]

[కన్నడం - మయూర - జూలై 71]